సాక్షి
శ్రీకాకుళం

శుక్రవారం । 30 । ఆగస్టు । 2024



గురుకుల పాఠశాలపై..

అక్కుపల్లి మత్స్యకార పాఠశాలపై అధికార పార్టీ నేతల కన్ను పడింది. వేరే చోటకు మార్చే ప్రయత్నం జరుగుతోంది. - 8లో



వరకట్న వేధింపులతో..

నరసన్నపేటలో మహిళ అనుమానాస్పద మృతి ఆత్మహత్య అని పోలీసులు తేల్చారు. వరకట్న వేధింపులే కారణమని తెలిపారు. - 8లో

తలనీలాల వేలంపాట వాయిదా

శ్రీకాకుళం న్యూకాలనీ: అరసవల్లి సూర్యనారాయణస్వామి దేవస్థానంలో గురువారం జరగాల్సిన తలనీలాల వేలం పాట వాయిదా పడింది. గత ఏడాది కంటే తక్కువకు వేలం నమోదు కావడంతో వాయిదా వేయడం జరిగిందని ఆలయ ఈఓ డీఎల్‌వీ రమేష్‌బాబు తెలిపారు. తదుపరి వేలం తేదీని త్వరలో ప్రకటించనున్నారు.



కఠినంగా శిక్షించాలి

కోల్‌కతాలో డాక్టర్‌పై హత్యాచారానికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలి. రాత్రి, పగలు తేడా లేకుండా రోగుల కోసం నిరంతరం పనిచేసే మహిళా డాక్టర్లు, మహిళా వైద్య సిబ్బందికి ప్రత్యేక రక్షణ కల్పించాలి. కోల్‌కతా లాంటి సంఘటనలు భవిష్యత్‌లో జరగకుండా ప్రభుత్వాలు ప్రత్యేక రక్షణ చట్టాలు తీసుకువచ్చేలా చర్యలు చేపట్టాలి.

– ఆరుద్ర, సీనియర్ ఏఎన్‌ఎం, తురకపేట పీహెచ్‌సీ, ఎల్‌ఎన్ పేట



భద్రతా చర్యలు తీసుకోవాలి

ఆస్పత్రుల్లో మహిళా సిబ్బందిపై దాడులు జరగకుండా ప్రభుత్వాలు భద్రతా చర్యలు చేపట్టాలి. వైద్యులకు, మహిళలకు భరోసా కల్పించే విధంగా ప్రత్యేకమైన చట్టాలను తీసుకొచ్చి అమలుచేయాలి. అప్పుడే మహిళలు నిర్భయంగా విధులు నిర్వర్తించగలుగుతారు.

– డాక్టర్ ఫరూక్ హుస్సేన్, వైద్యాధికారి, హిరమండలం పీహెచ్‌సీ



న్యూస్‌రీల్

నైరా వర్సిటీ సందర్శన



బోధన తరగతులను పరిశీలిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని నైరాలో గల ఆచార్య ఎన్‌జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయాన్ని గురువారం ఉపకులపతి డాక్టర్ ఆర్.శారద జయలక్ష్మీదేవి సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె బోధన సిబ్బంది, విద్యార్థులతో వేర్వేరుగా మాట్లాడారు. నాణ్యమైన విద్యను అందించడం ద్వారా విద్యార్థులు ఉన్నతమైన స్థానాలకు చేరుకుంటారని అన్నారు. జేఆర్‌ఎఫ్ పోటీ పరీక్షలకు సన్నద్ధం కావాలని సూచించారు. ఆమెతో పాటు కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం.భరత్‌లక్ష్మీ సిబ్బంది పాల్గొన్నారు.

31నే ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఎన్టీఆర్ భరోసా పథకం కింద పెన్షన్ల పంపిణీ ఈ నెల 31వ తేదీ నుంచే మొదలు కావాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సెప్టెంబర్ నెల పెన్షన్‌లను ఒక రోజు ముందుగానే లబ్ధిదారులకు అందించాలని, సెప్టెంబర్ 1వ తేదీ ఆదివారం కావడంతో.. ఒక రోజు ముందుగానే అంటే ఆగస్టు 31వ తేదీన పెన్షన్ల పంపిణీ చేయాలన్న ప్రభుత్వ ఆదేశాలను పకడ్బందీగా అమలు చేయాలని సూచించారు. ఆ రోజు పూర్తిగా అందని వారికి సెప్టెంబర్ 2వ తేదీన సోమవారం రోజున పంపిణీ చేయాలని, కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టాలని స్పష్టం చేశారు.

గిడుగుకు ఘనంగా నివాళి



గిడుగు చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్


శ్రీకాకుళం పాతబస్టాండ్: తెలుగు భాష ఔన్నత్యాన్ని చాటి చెప్పిన మహనీయుడు, తెలుగు వ్యవహారిక భాషా పితామహుడు గిడుగు వెంకట రామమూర్తి అని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో గురువారం తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా గిడుగు వెంకట రామమూర్తి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ గిడుగు వెంకట రామమూర్తి పంతులు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. తెలుగుభాషతో పాటు సవర భాషకు లిపి కనుగొని భాషోద్యమానికి గిడుగు చేసిన కృషికి బ్రిటిష్ ప్రభుత్వం రావ్ బహదూర్ అని బిరుదునిచ్చిందని తెలిపారు. కార్యక్రమంలో ఎల్‌డీఎం సూర్య కిరణ్, కలెక్టరేట్ కార్యాలయం ఏఓ సూర్యనారాయణ, కలెక్టరేట్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సెపక్‌తక్ర జిల్లా జట్ల ఎంపికలు నేడు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా సీనియర్స్ సెపక్‌తక్ర జట్ల ఎంపికలు శుక్రవారం జరగనున్నాయని సెపక్‌తక్ర అసోసియేషన్ జిల్లా చైర్మన్ ఎమ్మెస్సార్ కృష్ణమూర్తి తెలిపారు. శ్రీకాకుళం నగరంలోని ఎన్టీఆర్ మున్సిపల్ హైస్కూల్ మైదానం వేదికగా శుక్రవారం సాయంత్రం 4 గంటల నుంచి ఈ ఎంపికల ప్రక్రియ జరుగుతుందన్నారు. వయో విభాగంతో పని లేదని, ఆసక్తి కలిగిన పురుషులు, మహిళలు ఎంపికల్లో పాల్గొనవచ్చని ఆయన చెప్పారు. మరిన్ని వివరాలకు సెపక్‌తక్ర జిల్లా కార్యదర్శి, కోచ్ జి.అర్జున్‌రావురెడ్డి (99492 91288)ని సంప్రదించాలన్నారు.

● ఆపరేషన్ దానేటి బద్నాం

అంతా టీడీపీ పన్నాగం



- పెద్దలాడిన డ్రామాలో చిక్కుకున్న డాక్టర్ దానేటి శ్రీధర్
- మంగళవారం రాత్రి శ్రీధర్ గెస్ట్‌హౌస్‌లో పేకాట
- పోలీసుల దాడిలో దొరికిపోయిన 'కొందరు'
- దానేటి శ్రీధర్ ఉన్నా.. ఆయన పేరు తప్పించి మిగతా ఆరుగురిపై కేసు నమోదు
- పథకం ప్రకారం పేకాట బ్యాచ్‌ను పట్టించిన వైనం
- పేరు తప్పించి పరువు నిలిపినట్టుగా డాక్టర్ ముందు షో
- ఫలించిన టీడీపీ పెద్దల ఎత్తుగడ

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

జనసేన నాయకుడు, ప్రముఖ వైద్యుడు దానేటి శ్రీధర్‌పై టీడీపీ మైండ్ గేమ్ ఆడింది. ఎచ్చెర్ల మండలం కుశాలపురం సమీపంలో ఉన్న దానేటి శ్రీధర్ గెస్ట్‌హౌస్‌లో జరిగిన పేకాటపై దాడుల దగ్గిరి నుంచి శ్రీధర్ పేరును తొలగించేవరకు హైడ్రామా నడిచింది. టీడీపీ పెద్ద తలకాయలు వేసిన ప్లాన్‌లో డాక్టర్ శరణు కోరి తప్పించుకునే పరిస్థితి చోటు చేసుకుందని జిల్లా వ్యాప్తంగా చర్చ జరుగుతోంది. ప్రజల్లో డాక్టర్‌ని బద్నాం చేసి, తర్వాత తామే ఆదుకున్నామని వారికి కలరింగ్ ఇచ్చి వ్యూహాత్మకంగా వ్యవహరించినట్టు తెలిసింది. దానికి పోలీసు వర్గాలు పథకం ప్రకారం సహకరించాయన్న ఆరోపణలు ఉన్నాయి.

అసలేం జరిగిందంటే..

కుశాలపురం సమీపంలోని దానేటి శ్రీధర్ గెస్ట్ హౌస్‌లో పేకాట జరుగుతున్నట్టుగా పోలీసు ఉన్నత స్థాయి వర్గాలకు పథకం ప్రకారం సమాచారం వెళ్లింది. స్పెషల్ బ్రాంచి, ఎచ్చెర్ల పోలీసులు మంగళవారం రాత్రి దాడి చేశారు. ఈ దాడిలో ఆరుగుర్ని పట్టుకున్నట్టు పోలీసు వర్గాలు లీకులిచ్చాయి. కానీ దాడి చేశారన్న సమాచారం అధికారికంగా చెప్పేందుకు ఆసక్తి చూపలేదు. అయితే, ఇక్కడ పట్టుబడిన వారిలో పోలీసు వర్గాలు చెప్పిన ఆరుగురితో పాటు మరొకరు ఉన్నారు. ఆయనే దానేటి శ్రీధర్ అని సమాచారం. కాకపోతే ఆయన పట్టుబడిన తర్వాత ఓ మంత్రి రంగంలోకి దిగడంతో దానేటి శ్రీధర్ పేరును తప్పించేశారనే ప్రచారం జరుగుతోంది. ఆయన లేకుండానే ఆయన గెస్ట్ హౌస్‌లో పేకాట నడిచినట్టుగా చిత్రీకరించారు. శ్రీధర్‌ను తప్పించే విషయం వ్యూహాత్మకమైనప్పటికీ ఆయన గెస్ట్ హౌస్‌లోనే పేకాట జరిగిందనేది ప్రజల్లోకి వెళ్లిపోయేలా లీకులిప్పించారు. ఇక పట్టుబడిన వారి పేర్లలో ఆయన్ని తప్పించినా పేకాట స్థావరంగా గెస్ట్‌హౌస్ యజమానిపై కేసు నమోదు చేయాలి. ఇక్కడది జరగలేదు.

దాడికి వెనక జరిగింది ఇదేనా..?

జనసేన నాయకుడు, డాక్టర్ దానేటి శ్రీధర్ రాజకీయంగా ఎదగాలని చూస్తున్నారు. మొన్నటి ఎన్నికల్లో ఎంతగానో ప్రయత్నించినా అవకాశం దొరకలేదు. ఎన్నికల తర్వాత జనసేన, టీడీపీ, బీజేపీ కూటమి అధికారంలోకి రావడంతో భవిష్యత్‌లోనైనా తనకు పదవి దక్కుతుందన్న ఆశతో యాక్టివ్‌గా ఉంటున్నారు. ఈ క్రమంలో శ్రీకాకుళం కార్పొరేషన్‌కు ఎన్నికలు జరిగితే మేయర్ పీఠం జనసేన దక్కించుకోవాలని, ఆ అవకాశం తనకే రావాలని దానేటి శ్రీధర్ కలలు కనడమే కాదు జనసేన అధినేత పవన్ కల్యాణ్‌తో కూడా చర్చించినట్టు తెలిసింది. సార్వత్రిక ఎన్నికల్లో ఎలాగూ పార్టీకి పోటీ చేసే అవకాశం రాలేదని, కార్పొరేషన్ మేయర్‌నైనా వశం చేసుకుందామని పవన్ కల్యాణ్ నుంచి సానుకూలత వ్యక్తమైందని సమాచారం. దానిలో భాగంగా కార్పొరేషన్ మేయర్ పదవే లక్ష్యంగా దానేటి శ్రీధర్ అడుగులేస్తున్నారు. తన రాజకీయ భవిష్యత్‌ను సన్నిహితుల వద్ద, పార్టీ శ్రేణుల వద్ద చెప్పడంతో కార్పొరేషన్ మేయర్ పదవీ వ్యవహారం ప్రచారానికి దారితీసింది. అయితే, ఈ పదవి కోసం టీడీపీలోనే పోటీ ఎక్కువగా ఉంది. టీడీపీలో ఉన్న పాత కాపులతో పాటు ఎన్నికలకు ముందు చేరిన వాళ్లు కూడా మేయర్ పీఠంపైనే ఆశతో ఉన్నారు. ఆ పదవి ఇస్తామంటేనే పార్టీలో చేరుతామనే కండీషన్‌తో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారన్న ప్రచారం నడిచింది. టీడీపీలోనే పోటీ ఉందనుకుంటే జనసేన కూడా రేసులోకి రావడంతో ఇబ్బందని భావించి దానేటి శ్రీధర్‌ను రాజకీయంగా దెబ్బకొట్టేందుకు కొన్ని శక్తులు వ్యూహాలు రచించినట్టు తెలిసింది. ఆయనకున్న బలహీనత ద్వారా బద్నాం చేసేస్తే ప్రజల్లో మంచి పేరు లేదని చెప్పి పక్కకు తప్పించవచ్చని ఆలోచించారు. అదును చూసి వ్యూహాత్మకంగా పోలీసులకు సమాచారమిచ్చి, గెస్ట్‌హౌస్‌పై దాడులు చేయించి, పేకాట ఆడుతున్న వారిని పట్టుకున్నారని వాదనలు వినిపిస్తున్నాయి.

ఒక వైపు డాక్టర్‌ను రక్షించినట్టు కలరింగ్ ఇస్తూనే.. మరోవైపు డాక్టర్‌ని బద్నాం చేసి మేయర్ ఆశావహుల జాబితా నుంచి ఆయనను తప్పించేలా నాటకం ఆడారు. ఆఖరి వరకు అనుకున్నట్టుగానే ప్లాన్‌ను అమలు చేశారు. పేకాట ఆడటం ముమ్మాటికీ తప్పే. ఆయన గెస్ట్‌హౌస్‌లో పేకాట శిబిరం నడపడం కూడా తప్పే. దీన్ని ఎవరూ కాదనలేరు. ఇలాంటి అసాంఘిక కార్యకలాపాలపై తప్పకుండా చర్యలు తీసుకోవాల్సిందే. కానీ శ్రీధర్ విషయంలో టీడీపీ పెద్దలు కుట్ర పన్నారు. అంటే ఒకవైపు డాక్టర్‌ను సేఫ్ చేస్తూ.. మరోవైపు ఆయన గెస్ట్ హౌస్ పేరుతో ప్రజల్లో బద్నాం చేసే విధంగా వ్యవహరించారు. లీకుల ద్వారా దానేటి శ్రీధర్‌ను తప్పించారని, ఆయన గెస్ట్ హౌస్‌లోనే అంతా జరిగిందనే ప్రచారానికి తావుఇచ్చారు. పేకాట నడిపే వాళ్లు.. పేకాట ఆడి దొరికిపోయే వాళ్లు మనకు నాయకులా అనే భావాన్ని ప్రజల్లోకి పంపించేలా టీడీపీ పెద్దలు పావులు కదిపారు. అనుకున్నట్టుగానే సక్సెస్ అయ్యారు.



కుశాలపురంలో ఉన్న డాక్టర్ దానేటి శ్రీధర్ గెస్ట్‌హౌస్

కర్త, కర్మ, క్రియ.. అంతా ఆ మంత్రేనా?

దానేటి శ్రీధర్ ఎపిసోడ్ వెనక ఓ రాష్ట్ర మంత్రి కీలకంగా వ్యవహరించినట్టు అనుమానాలు ఉన్నాయి. ఆయనకు ఆ సామాజిక వర్గమంటే అస్సలు పడదు. రాజకీయంగా పోటీగా తయారవుతారనే భావంతో తనకు అడ్డొచ్చిన ఒకరిద్దర్ని ఇప్పటికే తప్పించారు. చెప్పాలంటే కీలక పదవులు దక్కకుండా చేశారు. ఇప్పుడా విధంగా తాను ప్రామిస్ చేసిన వాళ్లకు లైన్ క్లియర్ చేసేందుకు కాళింగ సామాజిక వర్గానికి చెందిన డాక్టర్ దానేటి శ్రీధర్‌ను వ్యూహాత్మకంగా ఇరికించి, తానే సేవ్ చేసినట్టు కలరింగ్ ఇచ్చినట్టు చర్చ నడుస్తోంది.

బాధ్యతలు స్వీకరించిన కమాండెంట్ శామ్యూల్ జాన్



శామ్యూల్ జాన్

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా ఏపీఎస్పీ హయ్యర్ బెటాలియన్ (ఇండియన్ రిజర్వ్ బెటాలియన్) కమాండెంట్‌గా పి.శామ్యూల్‌జాన్ గురువారం ఎచ్చెర్లలోని కార్యాలయ చాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఈయన విజయనగరం అడిషనల్ ఎస్పీ (కమాండెంట్)గా ఉంటూ ఉద్యోగోన్నతి పొంది బదిలీపై ఇక్కడికి వచ్చారు. సొంత గ్రామం కాకినాడ కాగా ఆర్‌ఎస్‌ఐగా 1985లో విజయనగరంలో తొలిపోస్టింగ్ వచ్చింది. మంగళగిరి లో ఆర్‌ఐ (రిజర్వ్ ఇన్‌స్పెక్టర్)గా ఉద్యోగోన్నతి పొంది విజయనగరం, కడప, కాకినాడ, నిజామాబాద్, కడపలో చేశారు. గ్రేహౌండ్స్ అసిస్టెంట్ కమాండో, ఇమిగ్రేషన్ అధికారి, హైకోర్టులో చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్, కొత్తగూడెం థర్మల్ పవర్ ప్లాంట్ (రామగుండం)లో చేసి కడపలో అడిషనల్ ఎస్పీ (కమాండెంట్)గా ఉద్యోగోన్నతి పొందారు. అనంతరం విశాఖ, విజయనగరంలో చేసి బదిలీపై జిల్లాకు వచ్చారు. విధుల్లో చేరాక ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డిని జిల్లా పోలీసు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు.

డెంగీతో చిన్నారి మృతి



లాభాల ఝాన్సీ మృతదేహం

కంచిలి: కంచిలికి చెందిన చిన్నారి బాలిక లాభాల ఝాన్సీ(7) డెంగీ జ్వరంతో మృతి చెందింది. పది రోజుల కిందటి నుంచి బాలిక జ్వరంతో బాధ పడుతోంది. స్థానికంగా వైద్యం చేయించాక పరిస్థితి విషమించింది. దీంతో శ్రీకాకుళంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్చారు. అక్కడి నుంచి విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతిచెందింది. మృతదేహాన్ని రాత్రి విశాఖ నుంచి తీసుకువచ్చాక గురువారం అంత్యక్రి యలు నిర్వహించారు. బాలిక తండ్రి కామరాజు ఆటోడ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈయనకు ఇద్దరు కుమార్తెలు ఉండగా చిన్న కుమార్తె ఝా న్సీ జ్వరంతో మృతి చెందింది. ఘటనతో గ్రామమంతా విషాద ఛాయలు అలముకున్నాయి.

వెలగాడలో పంజా విసిరిన డయేరియా

- గ్రామంలో 30 మంది బాధితులు
- వైద్యం కోసం శ్రీకాకుళం, రాజాం ఆస్పత్రులకు తరలింపు



వెలగాడలో రోగులకు వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్లు ప్రతిష్ట శర్మ, అనుషా

జి.సిగడాం:

మండలంలోని వెలగాడ గ్రామంపై డయేరియా పంజా విసిరింది. గత మూడు రోజుల నుంచి దాదాపు ముప్పై మంది ఈ వ్యాధి బారిన పడడంతో గ్రామంలో భయాందోళన నెలకొంది. బాధితులు రాజాం, శ్రీకాకుళంలోని ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. గ్రామంలో ఎస్.పెద్దిరాజు, పి.కుమార్, పి.పవన్‌కల్యాణ్, ఎం.దుర్గమ్మ, ఎం.జనా, ఎ.మల్లేష్, రమణమ్మ, పి.జగదేశ్వరి, ఎ.ప్రభావతి, వి.ఉమాదేవి, పి.కూర్మారావు, ఎం.అప్పల దాస్, ఎం.త్రినాథరావులకు స్థానిక హెల్త్ క్లినిక్‌లో బాతువ వైద్యాధికారులు డాక్టర్ అనూష, డాక్టర్ ప్రతిష్ట శర్మలు వైద్యం అందించారు.

మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు హెచ్.గోవిందమ్మ, కోలా నాగమణి, ముగసాల నర్సింగరావు, గుడ్ల శ్వేతలను తరలించారు. అలాగే ప్రైవేటు ఆస్పత్రికి పిడుగు భాస్కరరావు, కంచర్ల సత్యవతి, పెద్ది రామారావు, పెద్ది తులసీ, పెద్ది సత్యవతి తరలించారు. రాజాం సామాజిక ఆస్పత్రికి ధర్మవరపు సన్యాసిరావు, ధర్మవరపు ప్రవళిక, తాడవలస తేజ, సీహెచ్ రమేష్, పులపు ఝాన్సీ, మచ్చ అమలను తరలించారు.

ఇంటింటా సర్వే..

వెలగాడ గ్రామంలో అతిసార వ్యాధి పంజా విసరడంతో వైద్య సిబ్బంది ఇంటింటా వెళ్లి సర్వే చేస్తున్నారు. డయేరియా వ్యాధి ప్రబలకుండా ఉండేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే మూడు టీములుగా ఏర్పాటు చేసి ప్రత్యేక వైద్య శిబిరాలను నిర్వహించి రోగులకు వైద్య సేవలను అందిస్తున్నారు. స్థానిక సర్పంచ్ బొల్లా జనార్ధనరావు, ఎంపీటీసీ పట్నాన దాలినాయుడు పంచాయతీ కార్యదర్శి చేబ్రోలు సురేష్‌కుమార్‌లతోపాటు మండల పంచాయతీ సిబ్బంది పర్యవేక్షణలో ముమ్మరంగా పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపడుతున్నారు.

అధికారుల పరిశీలన..

గ్రామంలో అతిసార ప్రబలడంతో జిల్లా వైద్యాధికారి బొడ్డేపల్లి మీనాక్షి, మండల పరిషత్ ప్రత్యేకాధికారి ప్రసాదరావు, ఎంపీడీఓ కె.నిశ్చల, తహసీల్దార్ ఎం.శ్రీకాంత్ హుటాహుటిన గ్రామానికి చేరుకున్నారు. గ్రామంలో డయేరియా వ్యాధి రావడానికి గల కారణాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో ఉన్న బోర్లన్నీ నిలుపుదల చేసి ఇతర ప్రాంతాల నుంచి ప్రత్యేక వాహనాల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. ప్రతి వీధిలో పారిశుద్ధ్య పనులు చేయాలని సూచించారు.

● నాలుగేళ్ల చిన్నారి మృతి



జి.సిగడాం: చిన్నారి మృతిపై బంధువుల నుంచి వివరాలు సేకరిస్తున్న జిల్లా అధికారులు

జి.సిగడాం: చిన్నాన్న పెళ్లి కోసం వచ్చిన చిన్నారిని డయేరియా మింగేసింది. శుభ కార్యం కోసం విశాఖ నుంచి వచ్చిన ధర్మవరపు రాము, పైడమ్మ కుమార్తె రాజేశ్వరి (4) డయేరియాతో మృత్యువాత పడింది. దీంతో వెలగాడలో విషాద ఛాయలు అలముకున్నాయి. వెలగాడ గ్రామంలో ధర్మవరపు తవిటిరాజు వివాహ వేడుక కోసం రెండు రోజుల కిందట పైడమ్మ, రాము, చిన్నారి రాజేశ్వరి కలిసి వచ్చారు. అయితే రాజేశ్వరికి డయేరియా సోకింది. ఆమెకు డైపర్ వేయడంతో తల్లిదండ్రులు విరేచనాలు అవుతున్న విషయాన్ని గమనించలేకపోయారు. గురువారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో చిన్నారి ఇంటి వద్ద మృత్యువాత పడిందని కుటుంబ సభ్యులు తెలిపారు. దీంతో పెళ్లింట్లో విషాదం నెలకొంది.

చిన్నారి మృతిపై ఆరా

నాలుగేళ్ల చిన్నారి డయేరియాతో మృతి చెందడంతో జిల్లా వైద్యాధికారి బొడ్డేపల్లి మీనాక్షి, మండల ప్రత్యేక అధికారి ప్రసాదరావు, డీఎల్‌పీఓ గోపిబాల, తహసీల్దార్ ఎం.శ్రీకాంత్, ఎంపీడీఓ నిశ్చల ఆరా తీశారు. విపరీతంగా విరేచనాలు కావడంతో రోగ నిరోధక శక్తి కోల్పోవడంతో చిన్నారి మృతి చెందిందని గ్రామస్తులు, వైద్య సిబ్బంది వెల్లడించారు.

మరో రెండు రోజులు వానలు

జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నాయి. ఈ వానలు మరో రెండు రోజులు కొనసాగే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. ఈ వానలు ఉభాలకు ఉపకరిస్తాయి. ఎడతెరిపి లేకుండా కురిసిన వానకు పలు గ్రామాల్లో లోతట్టు ప్రాంతాల్లోకి నీరు చేరింది. వందలాది ఎకరాల్లో నీరు చేరగా.. పలు చోట్ల మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లవద్దంటూ దండోరాలు వేశారు.

శ్రీకాకుళం పాతబస్టాండ్

ముంపులో లోతట్టు ప్రాంతాలు



సుసరాం వద్ద వర్షపు నీటిలో కనకదుర్గమ్మ ఆలయం

పోలాకి: మండలంలో రెండు రోజులుగా కురుస్తున్న వాన కారణంగా లోతట్టు తంపర పొలాలు ముంపునకు గురయ్యాయి. డీఎల్‌పురం, ప్రియాగ్రహారం, సుసరాం, గుప్పెడుపేట, అంపలాం, బెలమర తదితర రెవెన్యూ గ్రామాల్లో వందలాది ఎకరాలు మునిగిపోయాయి. తీర ప్రాంత గ్రామాల్లో మత్స్యకారులు వేటకు వెళ్ళవద్దని అధికారులు దండోరావేయించారు.



వాన.. హైరానా: శ్రీకాకుళం నగరంలో జోరువానలో వాహనదారుల కష్టాలు

వర్షపాతం (మిల్లీ మీటర్లలో)

సరుబుజ్జిలి	జలుమూరు	నందిగాం	పొందూరు	ఆమదాలవలస	వజ్రపుకొత్తూరు	ఎచ్చెర్ల	ఇచ్ఛాపురం	మందస	సంతబొమ్మాళి	టెక్కలి	కోటబొమ్మాళి	బూర్జ	నరసన్నపేట
94.2	70.2	62.8	59.8	58.6	56.4	47.8	46.6	53.6	50.6	48.2	50.6	46.8	39.6

సారవకోట	పలాస	పోలాకి	కవిటి	రణస్థలం	శ్రీకాకుళం	లావేరు	ఎల్‌ఎన్‌పేట	జి.సిగడాం	కంచిలి	సోంపేట	గార	పాతపట్నం	హిరమండలం	కొత్తూరు
52.0	41.4	36.2	33.6	38.4	38.2	35.2	26.4	34.8	28.2	30.2	26.4	13.8	10.6	3.6

చెరువుకు గండి



సంతబొమ్మాళి: మండలం కొల్లిపాడు గ్రామంలో గుండమ్మ చెరువుకు గురువారం గండి పడింది. ఇటీవల ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు చెరువు నిండిపోయి గట్టు కోతకు గురవడంతో గండి పడింది. దీంతో చెరువు నీరు మెయిన్ రో డ్డు పైన నుంచి ప్రవహించడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. అలాగే సుమారు 50 ఎకరాల వరకు నాట్లు ముంపు బారిన పడ్డాయి.

క్లుప్తంగా

'ఆపరేషన్ కగార్'పై నిరసన గళం



కుమారన్న వర్ధంతి సభ వాల్ పోస్టర్ల ఆవిష్కరణ

పలాస: ఆపరేషన్ కగార్ పేరుతో దేశంలో ఆదివాసీలను అంతమొందించే కుట్రలను ప్రజలు తమ సంఘటిత ఉద్యమాల ద్వారా ప్రతిఘటించాలని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి తాండ్ర ప్రకాష్ పిలుపు నిచ్చారు. పలాస మండలం బొడ్డపాడు అమర వీరుల స్మారక మందిరం వద్ద విప్లవ పోరాట యోధులు కుమారన్న, సీతారాంల 26వ వర్ధంతి సభ వాల్ పోస్టర్లను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రకాష్ మాట్లాడుతూ గిరిజనుల హక్కుల కోసం పోరాడుతూ పోలీసు కాల్పుల్లో 26 ఏళ్ల క్రితం లొత్తూరు కొండల్లో కుమారన్న సీతారాములు అమరత్వం పొందారని సెప్టెంబరు 10న లొత్తూరు పంచాయితీ పెదగంతరులో జరగనున్న వారి సంతాప సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు గొరకల బాలకృష్ణ, పీఓడబ్ల్యూ జిల్లా కార్యదర్శి పోతనపల్లి కుసుమ, పోతనపల్లి మల్లేశు, ఆర్.మాధవరావు, జె.అప్పయ్య, బర్ల గోపి,కామేశు, జానకమ్మ, సరస్వతమ్మ, ముఖలింగం లోకనాథం తదితరులు పాల్గొన్నారు.

'డ్రోన్ సేవలను రైతులు వినియోగించుకోవాలి'



డ్రోన్‌కు సంబంధించి కోరమండల్ సంస్థ తరఫున బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

శ్రీకాకుళం రూరల్: డ్రోన్ సేవలను రైతులు వినియోగించుకోవాలని కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ వైస్ ప్రెసిడెంట్ జీవీ సుబ్బారెడ్డి పిలుపు నిచ్చారు. గురువారం రాగోలు వ్యవసాయ క్షేత్రంలో నిర్వహించిన వ్యవసాయ యాంత్రీకరణలో మేళాలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. రైతులకు ఉపయోగపడే డ్రోన్లు, దిప్పాలు, కొత్త యంత్రాలు, ఇతర అత్యాధునిక వ్యవసాయ పరికరాలను ప్రదర్శించినట్లు చెప్పారు. ప్రధానంగా కోరమండల్ సంస్థ నిర్వహిస్తున్న డ్రోన్ సేవలను మహిళా రైతులు వినియోగించుకుంటున్నారని తెలిపారు. వీటితోపాటు ఎరువులు వ్యవసాయ యంత్రాల కంపెనీలు కూడా తమ అత్యాధునిక ఉత్పత్తులను ప్రదర్శించినట్లు ఆయన వెల్లడించారు.

రామకృష్ణాపురంలో చోరీ



దొంగతనం జరిగిన గదిలో వేలిముద్రలు సేకరిస్తున్న క్లూస్ టీమ్

జలుమూరు: అంధవరం పంచాయతీ పరిధి రామకృష్ణాపురంలో దొంగతనం జరిగింది. ఈ దొంగతనంలో మూడు తులాల బంగారం, కొంత నగదుతోపాటు వెండి పోయినట్లుగా భావిస్తున్నారు. బాధితులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. రేగాన కృష్ణమూర్తితో పాటు కుటుంబ సభ్యులు ఇటీవల బూర్జ మండలం సుంకరి పేట గ్రామంలోని బంధువుల ఇంటికి వెళ్లారు. గురువారం ఇంటికి వచ్చి చూసేసరికి వెనక భాగం తలుపులు తీసి ఉంది. బీరువా తాళాలు తెరిచి బట్టలు చెల్లాచెదురుగా పడేసి ఉండడం గమనించారు. దీంతో అనుమానం వచ్చి పోలీసులకు సమాచారం అందజేశారు. అయితే దొంగతనం ఈ మూడు రోజుల్లో ఎప్పుడు జరిగిందన్నది పోలీసులు నిర్ధారణకు రాలేకపోతున్నారు. శ్రీకాకుళం క్లూస్‌టీమ్ వచ్చి వేలిముద్రలు సేకరించింది. కృష్ణమూర్తి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ అశోక్‌బాబు తెలిపారు.

భద్రత కల్పించాలి

కోల్‌కతాలో జూనియర్ మహిళా డాక్టర్‌పై జరిగిన పాశవిక ఘటన చాలా దుర్మార్గం. ప్రజల ప్రాణాలు కాపాడే వైద్యుల ప్రాణాలకే రక్షణ లేకపోతే ఎలా..? రోజూ ఏదో ఒక చోట ఇలాంటి ఘటనలు జరుగుతూనే ఉన్నాయి. మహిళలకు భద్రత పెంచాలి. శిక్షలు కఠినతరం చేయాలి. ఆస్పత్రుల్లో ప్రశాంత వాతావరణం ఉండేలా చర్యలు తీసుకోవాలి.

– మీసాల షణ్ముఖరావు, హెల్త్ అసిస్టెంట్, పీహెచ్‌సీ, హిరమండలం





గురుకుల పాఠశాలపై
కూటమి నేతల కన్ను



అక్కుపల్లి మత్స్యకార బాలుర గురుకుల పాఠశాల

- వసతుల లేమి నెపంతో అక్కుపల్లి మత్స్యకార గురుకుల పాఠశాలను వేరే చోటకు మార్చేందుకు యత్నం
- పాఠశాల అద్దె విషయంలో డబ్బులు దండుకునేందుకని గుసగుసలు
- ఆందోళన వ్యక్తం చేస్తున్న మత్స్యకారులు, చిన్నారులు

వజ్రపుకొత్తూరు రూరల్: అక్కుపల్లిలో ఉన్న మత్స్యకార గురుకుల పాఠశాలపై కూటమి నేతల కన్ను పడింది. బడిలో వసతుల కొరత పేరు చెప్పి పాఠశాలను కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో సుదూర ప్రాంతమైన రామకృష్ణాపురంలో ఉన్న ఓ ప్రైవేట్ కాలేజ్, టీడీపీలో ఓ ముఖ్య నాయకుడికి చెందిన కళాశాలకు, ఇతర ప్రాంతాలకు తరలించేందుకు కూటమి నాయకులు ఆలోచన చేస్తున్నారు. పాఠశాల అద్దెకు ప్రభుత్వం నుంచి నెలకు రూ.50 వేల నుంచి 1.50 లక్షల వరకు రాబట్టి దీనిలో కమీషన్ కొట్టేయాలన్న ఆలోచనతో మంతనాలు సాగుతున్నట్లు మత్స్యకార గ్రామాల్లో గుసగుసలు వినిపిస్తున్నాయి.

ఇదీ పరిస్థితి..

మత్స్యకార పేద విద్యార్థుల కోసం అక్కుపల్లిలో 2017లో మత్స్యకార బాలుర గురుకుల పాఠశాలను ప్రారంభించారు. ప్రస్తుతం 190 మంది విద్యార్థులు ఈ పాఠశాలలో చదువుతున్నారు. విద్యార్థులకు అవసరమైన వసతి గదులు, తరగతి నిర్వహణ కోసం గురుకుల పాఠశాలతో పాటు పక్కనే ఉన్న బహుళ ప్రయోజక తుఫాన్ రక్షిత భవనాన్ని వినియోగించుకుంటున్నారు. అయితే ఈ భవనాలు కొద్ది పాటి మరమ్మతుకు గురి కావడంతో గత ప్రభుత్వం హయాంలో ఎంపీపీ నిధులు రూ.3 లక్షలతో మరమ్మతులు చేశారు. అప్పటి నుంచి భవనాల నిర్వహణ బాగానే ఉంది. అయితే కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ పార్టీల నేతల కన్ను ఈ పాఠశాలపై పడింది. ఇదే తడువు పాఠశాలనే వేరే చోటుకు బదిలీ చేస్తే భవన యజమానుల నుంచి కమీషన్ దొరుకుతుందని ప్లాన్ వేశారు. విద్యార్థుల ప్రయోజనాలు పక్కన పెట్టేసి తమ కమీషన్ కోసం కక్కుర్తి పడుతున్నారు. దీంతో మత్స్యకారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాలను వేరే చోటకు తరలిస్తే సహించేది లేదని పలువురు నాయకులు హెచ్చరిస్తున్నారు.



విద్యార్థుల వసతుల కోసం వినియోగిస్తున్న తుఫాన్ భవనం

ఆదేశాల మేరకు పాఠశాల బదిలీ

పాఠశాల విషయంపై ఇప్పటికే స్థానిక ఎమ్మెల్యే గౌతు శిరీష దృష్టికి తీసుకువెళ్లాం. ఇటీవల ఆమె పాఠశాలను పరిశీలించారు. పాఠశాల బదిలీ కోసం విద్యార్థుల తల్లిదండ్రులతో తీర్మానం చేశాం. ప్రస్తుతం పాఠశాల బదిలీ కోసం ప్రయత్నాలు జరుగుతున్నాయి. ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ ఆదేశాల మేరకు పాఠశాలను బదిలి చేస్తాం.

– జి.ప్రశాంతి, పాఠశాల ప్రిన్సిపాల్, మత్స్యకార గురుకుల పాఠశాల అక్కుపల్లి,

శాశ్వత భవన నిర్మాణం చేపట్టాలి

పాఠశాల శాశ్వత భవనాల నిర్మాణం కోసం బెండి గేట్ వద్ద సుమారు 10 ఎకరాల్లో స్థలాన్ని ప్రభుత్వం కేటాయించింది. గత ప్రభుత్వ హయాంలో భవనాల నిర్మాణం కోసం ప్రయత్నాలు జరిగాయి. ఈ దశలో ఎన్నికలు రావడంతో ప్రయత్నాలు అర్ధంతరంగా నిలిచిపోయాయి. అయితే కూటమి ప్రభుత్వం మత్స్యకార విద్యార్థుల ప్రయోజనం కోసం శాశ్వత భవనాలు నిర్మించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

తరలిస్తే అదనపు భారమే..

పాఠశాలను వేరే చోటకు తరలించి లక్షల రూపాయలు అద్దె చెల్లిస్తే ప్రభుత్వానికి అదనపు భారం తప్పదని స్థానిక మత్స్యకారులు, పలువురు నాయకులు అభిప్రాయపడుతున్నారు. అదే పాఠశాలలో మరమ్మతులు పనులు నిర్వహించి శాశ్వత భవనాలు నిర్మించే వరకు ఇక్కడ తరగతులు నిర్వహిస్తే సరిపోతుందని అంటున్నారు.

'యాంత్రీకరణతో అధిక దిగుబడులు'



పంటల బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం రూరల్: రైతులు వ్యవసాయ యాంత్రీకరణపై దృష్టిసారించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సూచించారు. వ్యవసాయంలో తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు తీసుకురావాలన్నారు. ఆచార్య ఎన్‌జీరంగా వ్యవసాయ విద్యాలయం, పరిశోధన సహ సంచాలకులు, ఉత్తర కోస్తా మండలం రాగోలు వ్యవసాయ పరిశోధన స్థానం వ్యవసాయ శాఖలు గురువారం ఏర్పాటు చేసిన వ్యవసాయ యాంత్రీకరణ మేళాలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ రైతులు యాంత్రీకరణ పద్ధతులతో అధిక దిగుబడులు సాధించవచ్చని పిలుపునిచ్చారు. చిన్న, సన్నకారు రైతులు అన్ని రకాల యంత్రాలను వినియోగించుకోవాలన్నారు. ఎన్‌జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉప కులపతి డాక్టర్ ఆర్.శారద మాట్లాడుతూ జిల్లాలో సాగునీటికి కొరత లేదని, జిల్లాలోని రైతులకు యాంత్రీకరణపై అవగాహన కల్పించాలన్నారు. సబ్సిడీ ద్వారా రైతులు యంత్రాలు కొనుగోలు చేసుకోవాలన్నారు. నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి మాట్లాడుతూ అందరికీ అన్నం పెట్టే రైతు పస్తులు ఉండే పరిస్థితి రాకూడదన్నారు. ఈ సందర్భంగా స్టాల్స్‌ను ఎమ్మెల్యేల చేతులు మీదుగా ప్రారంభించారు. అనంతరం ఉత్తర కోస్తా వ్యవసాయ యాంత్రీకరణ ద్వారా పండించిన పంటలపై తయారు చేసిన పుస్తకాలను వారు ఆవిష్కరించారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ జేడీ శ్రీధర్, పరిశోధన సంచాలకులు సాంబమూర్తి, డాక్టర్ పీవీ సత్యనారాయణ, డాక్టర్ ప్రమీలారాణి, పీవీకే జగన్నాథం, నాబార్డు డీడీఎం రమేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకర్ల భాగస్వామ్యంతోనే ఆర్థిక ప్రగతి



బ్యాంకర్ల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఆర్థిక ప్రగతిలో బ్యాంకర్ల భాగస్వామ్యంతో పాటు సహకారం ఎంతో అవసరమని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. జిల్లా స్థాయి డీసీసీ, డీఎల్ఆర్‌సి సమావేశం కలెక్టరేట్‌లో గురువారం జరిగింది. ఈ సమావేశంలో వివిధ స్వయం ఉపాధి పథకాల అమలు, రుణాల మంజూరు, గత త్రైమాసికంలో సాధించిన ప్రగతిపై బ్యాంకులు, ప్రభుత్వ శాఖలవారీగా కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వార్షిక రుణ ప్రణాళికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ జిల్లాలో 2024–25 ఆర్థిక సంవత్సరానికి మొద టి త్రైమాసికం జూన్ 30వ తేదీ నాటికి క్రెడిట్ ప్లాన్ లక్ష్యం రూ.12,943 కోట్లకు గాను రూ.4887 కోట్ల రుణాలు మంజూరు చేసి 38 శాతం ఆర్థిక ప్రగతిని సాధించామన్నారు. జిల్లాలో వ్యవసాయ రంగానికి మొదటి ఆర్థిక సంవత్సరానికి త్రైమాసికం నాటికి వ్యవసాయ రుణాలకు సంబంధించి రూ.8343 కోట్లు లక్ష్యానికి గాను రూ.2792 కోట్ల రుణాలు అందజేసి 34 శాతం ఆర్థిక ప్రగతిని సాధించామని తెలిపారు. గ్రామీణ ప్రాంతాలలో బ్యాంకింగ్ లావాదేవీలు మరింత బలోపేతం చేయాలన్నారు. చిరు వ్యాపారులకు ముద్ర రుణాల మంజూరుపై దృష్టి సారించాలన్నారు. ప్రతి గ్రామంలో రైతులు, మహిళా సంఘాలు, విద్యార్థులకు బ్యాంకింగ్, ఆర్థిక లావాదేవీలపై అవగాహన పెంపొందించే కార్యక్రమాలను తరచూ నిర్వహించాలన్నా రు. సైబర్ నేరాల నియంత్రణపై విద్యార్థులకు శిక్షణ ఇవ్వాలని వారి ద్వారా ఆయా ప్రాంతాల్లో అవగాహన కల్పించాలన్నారు. రిజర్వ్ బ్యాంక్ స్థాపించి 90 ఏళ్ల పూర్తయిన సందర్భంగా డిగ్రీ విద్యార్థులకు క్విజ్ ప్రోగ్రాం నిర్వహించాలని ఎల్డీఎంకు సూచించారు. దీనికి సంబంధించిన గోడపత్రికను ఆవిష్కరించారు.

గోమాతకు ప్రాణదానం



కొన ఊపిరితో పడి ఉన్న ఆవు



చికిత్స అందిస్తున్న పశువైద్యాధికారి, పారిశుద్ధ్య కార్మికులు



లేచి వెళ్తున్న ఆవు

నరసన్నపేట: అధిక వర్షాలతో ఓ ఆవు కొన ఊపిరితో ప్రాణాపాయ స్థితిలో ఉండగా స్థానికుడు మార్పు విజయ్‌తో పాటు పంచాయతీ సిబ్బంది, పశువైద్యుడు స్పందించి రక్షించారు. మారుతీ నగర్ మొదటి వీధిలో సినిమా హాల్‌కు వెళ్లే మార్గంలో ఒక ఆవు వర్షాలకు తడిచి లేవలేని స్థితిలో ఉంది. స్థానికులు ఆవు ఫొటోను సోషల్ మీడియాలో షేర్ చేశారు. దీంతో మా ర్పు విజయ్ వెంటనే ఆవు వద్దకు వెళ్లి పరిస్థితి గమనించి.. దేశవానిపేట పశువుల ఆస్పత్రి పశువైద్యాధికారిని సంప్రదించారు. కొన్ని మందులు ప్రైవేటు దుకాణంలో స్వయంగా కొనుగోలు చేసి తీసుకువచ్చారు. ఈలోగా స్థానిక పంచాయ తీ పారిశుద్ధ్య కార్మికులు కూడా వచ్చి సహకరించారు. మొత్తం 12 ఇంజెక్షన్లు ఇచ్చాక ఆవు అరగంటలో లేచి నడుచుకుంటూ వెళ్లింది. దీంతో అంతా ఆనందం వ్యక్తం చేశారు.

దుబాయ్‌లో వలస కార్మికుడు మృతి



శివ మజ్జి

కవిటి: మండలంలోని బొరివంకకు చెందిన శివ మజ్జి అనే నిరుద్యోగ యువకుడు దుబాయ్‌లో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు గురువారం తెలిపారు. ఆరు నెలలు క్రితం స్నేహితుడు బిసాయి మోహన్ తో కలసి దుబాయ్ వెళ్లాడు. ఇద్దరు వేర్వేరు చోట్ల కంపెనీల్లో పనులు చేసుకుంటున్నారు. బుధవారం రాత్రి శివ పని చేస్తున్న కంపెనీలో జరిగిన ప్రమాదంలో శివ మజ్జితో పాటు బీహార్ కు చెందిన యువకుడు మృతి చెందారు. ఈ విషయాన్ని కంపెనీ యాజమాన్యం స్నేహితుడు మోహన్ బిసాయికి తెలపడంతో గురువారం ఉదయం కుటుంబ సభ్యులకు తెలిపాడు. దీంతో బొరివంకలో విషాద ఛాయలు అలముకున్నాయి. వచ్చే ఏడాది పెళ్లి చేసుకోబోయే కొడుకు అర్ధంతరంగా తనువు చాలించాడు అంటూ తల్లి ఊర్మిళ మజ్జి రోదించారు. శివ చిన్నతనంలోనే తండ్రి జగన్నాథం మృతి చెందగా, తమ్ముడు ప్రసాద్ ఉన్నాడు. ఇచ్ఛాపురానికి చెందిన ఓ ప్రైవేట్ సంస్థ ద్వారా ఆ యువకుడు విదేశానికి వెళ్లడంతో.. అతడి కుటుంబ సభ్యులు ఇచ్ఛాపురంలోని ఆ సంస్థ కార్యాలయ సిబ్బందిని ప్రశ్నించారు. వారు సమాధానం చెప్పకపోవడంతో కుటుంబ సభ్యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దుబాయ్ నుంచి మృతదేహాన్ని తెచ్చేందుకు గ్రామస్తులు ప్రయత్నిస్తున్నారు.

రైలు ప్రమాదంలో ఒడిశా యువకుడు దుర్మరణం



మరణించిన ఒడిశా యువకుడు

కాశీబుగ్గ: కోటబొమ్మాళి రైల్వేస్టేషన్ పరిధిలోని రైలు పట్టాలపై ఒడిశాకు చెందిన యువకుడు మరణించిన సంఘటన గురువారం జరిగింది.

మృతుడిని ఒడిశా రాష్ట్రం గజపతి జిల్లా గురండి బ్లాక్ పరిధిలో కొర్సండ గ్రామానికి చెందిన యువకుడిగా గుర్తించారు. ముప్పై ఐదేళ్ల వయసు ఉంటుందని, మరణానికి గల కారణాలు తెలియాల్సి ఉందని జీఆర్పీ పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పలాస ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పలాస జీఆర్పీ ఎస్ఐ షరీఫ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



బెండి వరహాలు (ఫైల్)

కోటబొమ్మాళి: కస్తూరిపాడు పంచాయతీ గంగుపేట గ్రామం వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎలమంచిలి గ్రామానికి చెందిన బెండి వరహాలు(63) మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వరహాలు పశువుల వ్యాపారం చేస్తుంటారు. గురువారం తమ గ్రామానికి చెందిన మామిడివలస మల్లేసుతో కలిసి ద్విచక్రవాహనంపై పశువులు కొనేందుకు వెళ్లి తిరిగి వస్తుండగా.. గంగుపేట వద్దకు వచ్చేసరికి ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి బండి అదుపు తప్పి రోడ్డు పక్కన గల గుంతలో పడ్డారు. ఈ ప్రమాదంలో వరహాలు తలకు తీవ్రగాయమైంది. 108 వాహనంలో రిమ్స్ ఆస్పత్రికి తరలిస్తుండగా దారిలోనే చనిపోయారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శ్రీనివాసరావు తెలిపారు.

వరకట్న వేధింపులతో మహిళ ఆత్మహత్య



సంఘటనా స్థలాన్ని తహసీల్దార్‌తో కలసి పరిశీలిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు

నరసన్నపేట: స్థానిక శ్రీనివాస అపార్ట్‌మెంటు నాలుగో ఫ్లోర్‌లో బుధవారం అనుమానాస్పదంగా మృతి చెందిన వివాహిత అనూరాధ.. ఆత్మహత్య చేసుకున్నట్టుగా పోలీసులు నిర్ధారించారు. భర్త, అత్త,మామలు వరకట్నం కోసం వేధించడంతో అనూరాధ ఆత్మహత్యకు పాల్పడిందని పోలీసులు భావిస్తున్నారు. గురువారం పలాస డీఎస్పీ శ్రీనివాసరావు నరసన్నపేట తహసీల్దార్ సత్యనారాయణతో కలసి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. అనూరాధ తల్లి ఇతర కుటుంబ సభ్యులతో మాట్లాడారు. ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు. డీఎస్పీ వెంట నరసన్నపేట సీఐ జె.శ్రీనివాసరావు, ఎస్ఐ సీహెచ్ దుర్గాప్రసాద్ తదితరులు ఉన్నారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

స్టేట్ బ్యాడ్మింటన్ పోటీలకు ప్రతిష్టాత్మకంగా ఏర్పాట్లు

- సెప్టెంబర్ 3 నుంచి 6వ తేదీ వరకు శ్రీకాకుళంలో రాష్ట్ర బ్యాడ్మింటన్ పోటీలు



బ్యాడ్మింటన్ స్టేట్‌మీట్‌కు సంబంధించిన బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న కె.సాగర్, డాక్టర్ గూడేన, కిరణ్‌కుమార్, అశోక్, సూరిబాబు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా కేంద్రంలో సెప్టెంబర్ 3 నుంచి 6వ తేదీ వరకు జరగనున్న ఏపీ రాష్ట్ర స్థాయి జూనియర్స్(అండర్–19) బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీలకు ప్రతిష్టాత్మకంగా ఏర్పాట్లు చేస్తున్నట్టు బ్యాడ్మింటన్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జిల్లా అధ్యక్షుడు కిల్లంశెట్టి సాగర్ పేర్కొన్నారు. శ్రీకాకుళం నగరంలోని శాంతినగర్ కాలనీ ఇండోర్ స్టేడియం వేదికగా గురువారం సాయంత్రం జిల్లా బ్యాడ్మింటన్ సంఘ చీఫ్ ప్యాట్రన్ డాక్టర్ గూడేన సోమేశ్వరరావు, వ్యాపారవేత్త, బ్యాడ్మింటన్ సంఘ కార్యనిర్వాహక కార్యదర్శి నారాయణశెట్టి వెంకట కిరణ్‌కుమార్ తదితరులతో కలిసి స్టేట్‌మీట్‌కు సంబంధించిన బ్రోచర్‌ను ఆవిష్కరించారు. సాగర్ మాట్లాడుతూ దాదాపు రూ.7లక్షల అంచనా వ్యయంతో ఈ బ్యాడ్మింటన్ జూనియర్ స్టేట్‌మీట్‌ను నిర్వహించేందుకు ఇప్పటికే ఏర్పాట్లు ప్రారంభించినట్టు చెప్పారు. తొలి రోజు 3వ తేదీన క్వాలిఫైయింగ్ రౌండ్స్ జరుగుతాయని, మిగిలిన మూడు రోజులు (4 నుంచి 6వ తేదీ వరకు) మెయిన్ డ్రా పోటీలు జరుగుతాయన్నారు. పోటీలకు కిమ్స్ హాస్పటల్ డైరెక్టర్, సంఘ చీఫ్ ప్యాట్రన్ డాక్టర్ గూడేన సోమేశ్వరరావు, వ్యాపారవేత్త, బ్యాడ్మింటన్ సంఘ కార్యనిర్వాహక కార్యదర్శి ఎన్‌వీ కిరణ్‌కుమార్ ఆర్థికంగా బాసటగా నిలిచేందుకు ముందుకు రావడం సంతోషంగా ఉందన్నారు. స్టేట్ టోర్నీలో క్రీడాకారులతోపాటు మొత్తం 250 మంది ప్రాతినిధ్యం వహిస్తున్నట్టు చెప్పారు. వీరికి స్థానికంగా వసతి, భోజన ఏర్పాట్లు కల్పిస్తున్నట్టు చెప్పారు. బ్యాడ్మింటన్ సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి మెట్ట అశోక్‌కుమార్, జిల్లా సీఈఓ సంపతిరావు సూరిబాబు మాట్లాడుతూ ఇక్కడ జరిగే పోటీల్లో రాణించి విజేతలగా నిలిచిన క్రీడాకారులు సెప్టెంబరు 8 నుంచి 12 వరకు రాజమండ్రిలో జరగనున్న సౌత్‌జోన్ నేషనల్స్ జూనియర్స్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీలకు అర్హత సాధిస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బ్యాడ్మింటన్ సంఘ ఉపాధ్యక్షుడు భైరి దామోదర్, గురుగుబెల్లి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పొంచి ఉన్న వరద ముప్పు



పూడిలంక రహదారి గట్టు వద్ద పెరిగిన వరద తాకిడి

వజ్రపుకొత్తూరు: పూడిలంక వాసులకు కష్టాలు తప్పడం లేదు. ప్రస్తుతం నాటు తెప్పపై రాకపోకలు సాగిస్తున్నా.. అది తాత్కాలికమే. వరద ఎక్కువైతే ఆ తెప్ప కూడా నిలిచిపోతుంది. ప్రస్తుతం భారీ వర్షాలు పడతాయని వాతావరణ శాఖ సూచిస్తుండడంతో పూడిలంకకు ముప్పు తప్పేటట్లు లేదు. ఇప్పటికే బెండి గెడ్డకు వరద ఎక్కువైంది. దీంతో ఆ గ్రామ వాసులు ముందే నిత్యావసర సరకులు, మందులు, తెచ్చుకుని ఇంటి వద్ద ఉంచుకుంటున్నారు. తమ కష్టాలు పూర్తిగా తీర్చేందుకు వరద గట్టును పూర్తిగా నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

మల్టీపర్పస్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణానికి ప్రతిపాదన



శ్రీకాకుళంలో క్రీడోత్సవ 2కె ర్యాలీలో పాల్గొన్న అధికారులు, కోచ్‌లు, క్రీడాకారులు

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం రూరల్ పరిధిలోని పాత్రునివలసలో ఖేలో ఇండియా పథకంలో భాగంగా కేంద్ర ప్రభుత్వ నిధులతో మల్టీపర్పస్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణానికి రూ.40 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేశామని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పేర్కొన్నారు. పాత్రునివలసలో నిర్మితం కాబోయే మల్టీపర్పస్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను రెండేళ్లలో పూర్తిచేసి, అందుబాటులోకి తీసుకువస్తామని ఆయన తెలిపారు. జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం స్థానిక శాంతినగర్‌కాలనీలోని డీఎస్‌ఏ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన కార్యక్రమంలో శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్‌తో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ మాట్లాడుతూ ఇప్పటికే నిర్మిస్తున్న క్రీడా వికాస ప్రాంగణంతో అన్ని క్రీడాంశాలను ఒకే చోటుకు తీసుకువస్తామన్నారు. శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ కేఆర్ స్టేడియం పనులో త్వరలో పూర్తిచేస్తామని, ప్రతివారం పనుల పురోగతిని తాను స్వయంగా పరిశీలిస్తున్నట్లు చెప్పారు. అనంతరం వివిధ క్రీడా పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులు/జట్లకు బహుమతులు, ప్రసంశా పత్రాలు అందజేశారు.

గత ఏడాది జాతీయస్థాయిలో పతకాలు సాధించిన క్రీడాకారులను ఎమ్మెల్యే, కలెక్టర్ సత్కరించారు. అయితే అంతకుముందు శ్రీకాకుళం జరిగిన జాతీయ క్రీడోత్సవ ర్యాలీ చప్పగా సాగింది. వైఎస్సార్ సర్కిల్ నుంచి శాంతినగర్‌కాలనీలో ఉన్న ఇండోర్ స్టేడియం వరకు జరిగిన 2కే ర్యాలీకి ప్రజాప్రతినిధులు, జిల్లా ఉన్నతాధికారులు మొహం చాటేశారు.